కథలు:

# గంగజిమ్మ

**కాంతి**

పచ్చగా ఒక గీత గీసినట్లు కన్పిస్తున్నది ఆవలివడ్డు - బీరమాయ గుట్ట కింది ప్రదేశం. గోదావరి నది ఇక్కడ ఆవలి వడ్డుకు ఈవలి వడ్డుకు నడుమ దాదాపు మైలున్నర దూరం వుంటుంది. బీరమాయ గుట్టకు కుడిచేతి వైపు వరుసగా మద్దిగూడెం, గంగపల్లి, రాళ్ళపేట వూర్లు వున్నాయి. ఈవలి వడ్డుమీద నుండి చూస్తే ఆ గ్రామాలు బొమ్మరిళ్ల లాగా కనిపిస్తున్నాయి. గుట్టమీది నుండి పోయె తోవకటీటు[1] పల్సగా వున్న చెట్లు - దిట్టంగా[2] పెరిగిన అడివి మ్యధన తోవ వున్నట్లు సాటి చెప్పుతున్నై.

ఇక్కడ గోదావరి పెద్దమలుపు తిరిగింది. పడమటి నుండి వస్తున్న గోదావరి ఎగువన మూడు మైళ్ల పైకిపోతే వూరెన్క గుట్ట, దుర్గం గుట్టలు రెండు దిక్కుల నుండి అడ్డం వచ్చినందుకు ఇరుకులో[3] పడి ఉత్తరంవైపు తిరిగి ఈ బీరమాయ గుట్టకు తాకి మళ్ళీ దక్షిణానికి మరలింది గోదావరి. వానా కాలంలో దుర్గం గుట్ట, ఊరెన్క గుట్టల నడుమ పెద్ద పెద్ద సుడులు తిరుగుతుంటై.

ఐతే ఈ సలికాలంలో గోదావరి నీరు తగ్గి సగమే పారుతుంది. దుర్గం గుట్టకు, బీరమాయ గుట్టకు నడుమ పెద్ద మడుగు[4] ఇప్పుడే కాదు ఎండా కాలంలో కూడా అంతే లోతువుంటుంది. ఈ మాగిలో[5] పొద్దుగాల బీరమాయ గుట్టమీంచి సూర్యుడు మీదికి వస్తుంటే ఆ వెలుగు గోదావరి నీళ్ళలో పడినప్పుడు ఆ నీళ్లు అద్దం లాగా మెరుస్తుంటయి.

గోదావరి బీరమాయకు తాకి దక్షణానికి తిరిగిన కాడ[6] ఈవలి వడ్డుకు అడివి నిటారుగా దిగిపోయిన వడ్డు కాడి నుండి దిగువకు పోయిన కొద్ది దూరం జరిగింది. అక్కడికి దగ్గర దగ్గర మైలున్నర దక్షిణానికి పోతే దంపాయ గ్రామం వుంటుంది. ఇది చాలా చిన్నవూరు. మొత్తం ఎనభై గుడిసెలుంటై. ఒడ్డుకు అడివికి చెరిసగాన[7] చాకలి వొర్రె పక్కకు ఎత్తు బోరు[8]- మాదిగబోరు, ఏడెనిమిది గుడిసెలుంటై. దాని ఎడమ పక్కకు కుంట కాలువ ఒర్రెతో కలిసే కాడా బోరు మీద మూడు బజార్లకటూ ఇటూ దాదాపు నలభై గుడిసెలు, ఉత్తరం బాజుకు[9] పెద్దచింత కింది దాకనే ఎక్కువ వుంటై. గోదావరి వొడ్డుకు - అడివికైను ఈవల రెండు చిన్న గుట్టల నడుమ కట్టిన చెరువుకుంటకు అడ్డంగా పదిగాల గుడిసెలుంటై. అక్కడికి ఫర్లాంగు దూరాన నిలువుగా దిగిపోయిన గోదావరి వొడ్డెంబడి నిండుగా



1. దారికి అటు ఇటు ప్రక్కన 2. దట్టంగా, ఒత్తుగా 3. సన్నము 4. నీటిగుంట, 5. చలికాలము 6. వద్ద 7. మధ్యలో 8. మట్టిదిబ్బ 9. దిక్కుకు

గోదావరి పారుతున్నప్పుడు వానా కాలంలో ఒడ్డుజారితే ఆ గుడిసెలు ఎట్లుంటయో?- అనిపించేటట్లు వొడ్డుకు ఆ పదిహేను గుడిసెలు వున్నై. ఇవన్ని దొరచట్టపోల్ల[1] ఇండ్లె. చింతక్రింది కెల్లి బోరుమీదికి వస్తుంటే సర్కారు బాయి దాటినాక ఈమధ్య పెట్టిన ఆశ్రమ స్కూలు, మూడు బజార్లకాడవుంది. దానికి అటు ఇటూ పంతుల్లు వుంటున్నరు.

గోదారి వడ్డుకు అడివిలైనుకు నడుమ గోదావరి మలుపు కాడికెల్లి నిలబడి చూస్తే ఎంతదూరం చూసినా ఒకమైలు దాక పైలాయించిన[2] చేన్లే అగుపడ్తయి. ఒడ్డు పొడుగూత బైలే.[3] లైను అవల చిన్న చిన్న గుట్టబోర్లు, బైలావల గోదావరి. దానవతల మల్లికొంత దూరం బైలు మల్లి కొండలు-అడివి.

## 2

మాగిల ఒకరోజు బలుసంభపేల[4] కావచ్చు, పసులు అడివి జేరుకుంటున్నై. నిలివెడెత్తు పెరిగిన మింజొన్న[5] కర్రలు కనబడే కాడికి గోదావరొడ్డెంబడి వున్నై. వూరు చుట్టూ పెరిగిన జొన్నచేండ్లు వూరు కానరాకుండా జేసినై. అక్కడక్కడ గుడిసెల నుండి పొగఎల్లుతుంచే వూరున్నట్లు తెలుస్తుంది. నీళ్ళింకిపోయిన కుంట కింద యాబై ఎకురాల వరిచేండ్లు బీటలుబారి వున్నకాడా ఒకరిద్దరు తిరుగుతున్నరు. ఇది తప్ప పెద్ద అలికిడి[6] లేదు.

దాదాపు పదహారు - పదిహేడేండ్ల పిల్లవాడొకడు కుంట దాటి అడివిలో కొచ్చిండు. కొండ గొర్రెలాగా బెదురు కండ్లతో అటు ఇటు చూస్తూ ఎడమ చేతి దిక్కు అగుపడుతున్న[7] కచ్చడాల బాటెంబడి[8] వురుకు తున్నంతవీగిరంగా[9] నడుస్తున్నడు. పెద్దరాళ్ళ గుట్టకిందికొచ్చి ఒక్కనిముష మాగి అన్ని దిక్కుల ఒక్కతడువ[10] జూస్కున్నడు. అలికిడి లేదని చూసుకొని పిట్ట మాదిరిగా ఈల కొట్టిండు. కాసేపే అలికిడి లేదు. ఈ సారి ఇంకా గట్టిగా ఈల వేసి ఆగిండు.

గుట్ట లొద్దులో[11] కెల్లి ఈ సారి అటువంటి ఈలే యినొచ్చింది...కాదు, గుట్టలకు తాకి తిరిగొచ్చిన తన ఈల కాదు - ఇది తన ఈలకు జవాబు గొచ్చిన సైగేనని తెలుసు కొన్నంక లొద్దిలోకి నడిచిండు.

ఏడెనిమిది మంది పరికి పండ్ల తీగెల పొదల్లో ముదురాకు పచ్చబట్టలు - 'డ్రెస్సులు' వేసుకొని కూకున్నరు. ఒకాయన రెండొందల గజాల దూరంల కాలిబాట పక్కకు చెట్ల చాటున రైఫిలు బుజాన బెట్టి తనకెయ్యి[12] చూస్తున్నడు. గుర్తు

---

1. కోయలలో ఒక తెగ 2. విస్తరించి 3. మైదానం 4. ఉదయం పదిగంటల సమయం 5. తెల్లజొన్న 6. శబ్దం. 7. కనిపిస్తున్న 8. ఖండబాట 9. తొందరగా 10. ఒకసారి 11. గుట్ట లోయల్లో 12. తనవైపు

పట్టిండు - ఈరన్న... సెంట్రీగున్నడు. దళంలోని మిగతావాళ్ళు తను ఈరన్న పక్కపొంటి నడిసొస్తుంటే నవ్వి పలకరిస్తున్నరు. వాళ్ళు తెల్లందన్కా[1] నడిచినట్లు వున్నరు. అందరి మొఖాలలో అలుసటగుపడుతుంది.

ఇది చిన్నన్న దళం. దగ్గర కొచ్చినాంక చిన్నన్న పరుపుబండ మీద కూకున్నోడు లేచి కావలించు కొన్నడు పావురంగా.[2]

పల్కరించిండు "ఏం కామ్రేడ్ పాపన్న! ఏం సంగతి?"

బాబన్న ఒక పక్కకు కూసోని రైఫిల్ తుడుచుకుంటూ వున్నడు. పాపన్న (వచ్చినతన్ని) ను చూసి నల్లగా మసి అంటిన కుడి చేయి ఎత్తి పిడికిలి గట్టిగా బిగించి "లాల్ సలాం" అన్నడు. కడమోల్లు[3] కూడా 'లాల్‌సలామ్' చేసింద్రు దానికి జవాబుగా పాపన్న అందరికి లాల్‌సలామ్ చేసి చిన్నన్నను ఒక పక్కకు తీసుకొనిపోయి ఏదో చెప్పిండు. చిన్నన్న తిరిగి దళం దగ్గరకు వచ్చి; "కామ్రేడ్స్ మన పాపన్న చాలా అవసరముండి వచ్చిండు. నేనువెంటనే ఆయనతో వెళ్ళాలి. మన అంకమ్మ చెల్లెలు దాదాపు మూడు వారాలకుపైన జబ్బుతో మంచం పట్టిందంట. మనం వచ్చినట్లు తెల్సి అవ్వ పాపన్నను నన్ను తోలుక రమ్మని పంపింది. ఇవ్వాల పొద్దటి నుంచి అంకులు అసలు కండ్లు తెరువనే లేదట! నేను మన చెల్లెను చూసి రావటం చాలా అవసరం మీరే మంటారు కామ్రేడ్స్?" అని అడిగిండు.

బాబన్నకు అంకులు చెల్లె ఆరోజు కట్టిచ్చిన సద్దిమూట యాదికి వచ్చింది. నడిజాము[4] రాత్రిలేసి ఆ చెల్లి గట్కపిండి కల్పి రొట్టెలు చేసి, తననులేపి, మొఖము కడగనీకి నీళ్ళ చెంబందించి ఎంతో పావురంగా రాత్రి మిగిలిన సద్దిబువ్వ కారం తొక్కుతో బెట్టి తినమని - నీళ్ళుతాపి తన దళంలో మిగిలిన వారికని రొట్టెలు పాత పేల్కలో కట్టిచ్చింది. తల్లి లాంటి ఆ చెల్లెకు ఏ జబ్బు పట్టుకుందోనని చాలా బాదపడ్డడు. ఈరన్న, వహీదు, సోమన్న, భీమన్నలకు కూడా ఈ సంగతి విని గుండెలవిసినట్లయింది.

సిమాంట[4] ఈవూరు వచ్చినప్పుడు అంకులే కదా క్యాంపోల్లు అట్టాయించినా[5] - వీల్లు తన పెద్దయ్య కొడుకులేనని చెప్పి - నమ్మించి ఊరు దాటించి చెరువవుతలి కందిచేను కాడికి తీసుకొచ్చి కూకోబెట్టి మల్లి కాసేపటికి బట్టలమూటలో బుర్ర[6] దాచి పట్టుకొచ్చి కడుపునిండా అంబలి పోసి-బద్రంగా తోలింది. ఆ చెల్లి సుడిబడ్డదని[7] తెలిసి చానా బాధనిపించింది. అందరూ చిన్నన్నవైపు చూసింద్రు.

---

1. తెల్లవార్లు 2. ప్రేమగా 3. మిగతావారు 4. మొట్టమొదటి సారి 5. ఆపినా, అడ్డగించినా, 6. సొరకాయ ఎండిన తరువాత-దానిలోని గుజ్జుతీసివేసి పాత్రలా వాడుకుంటారు. 7. జబ్బుపడ్డది.

భీమన్న 'ఐతే కామ్రేడ్ చిన్నన్న, ఈ నిర్బంధపు రోజుల్లో పట్టపగలు అదీ మనకు బాగా సంబంధమున్నదని శతృవుకు తెల్సిన వూరికి వెళ్ళడం ప్రమాదకరమేమోనని నా కనిపిస్తుంది. అదయిన శతృక్యాంపు వున్నకాడికి అంత దగ్గరలో!' అనుమానంగా అన్నాడు.

ఒక్కక్షణం నిశబ్దంగా గడిచింది.

''అ మాట నిజమే! ఐనా కామ్రేడ్ భీమన్నె అన్నట్లు ఆ గ్రామంతో మనకు గట్టి సంబంధాలు వున్నె, పోతే పగలు వెళ్ళటంలో ప్రమాదమున్నందుకు నా అభిప్రాయంలో రాత్రిదాక ఆగి వెళ్ళటం మంచిది.'' సోమన్న తన సలహా చెప్పిండు. 'మీరేమంటారు కామ్రేడ్ పాపన్న?' పాపన్నవైపు చూస్తూ.

'జబ్బు నా చెల్లెకే అయినా కామ్రేడ్ చిన్నన్న లాంటోని మాటకొచ్చేసరికి అన్ని దిక్కులనుండి కొట్టిచూసి అప్పుడు ఏదోఒకటి చెయ్యాలి. తొందర చేస్తే నష్టమైనా ఐతది.' అని పాపన్న ఆగి ఆగి చెప్పిండు. కీడెంచి మేలెంచాలనే దోరణిలో.

వీరన్న లేచినిలబడి 'నిర్భంధ ముందని మన ప్రజలను వదిలిపెట్టలేము కదా! మన అంకులు, కామ్రేడ్ పాపన్న చెల్లె మన వుద్యమంలో ఈ చిన్నప్పుడే ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చేది, మనం మరిచిపోలేము. అంతకైతే కామ్రేడ్ చిన్నన్నతో కల్సి ఇంకొకరు పోవచ్చు, పోవాలి! నేనే వెళ్ళవస్తా చిన్నన్నకు తోడుగా' ఉత్తేజంగా చెప్పి టక్కున కూర్చున్నాడు. కిందపెట్టిన తనసంచి వీపుపై పెట్టుకుంటూ అప్పుడే బయలుదేరాలన్న తన అభిప్రాయానికి కార్యరూపం ఇవ్వబోతున్నట్టు.

చిన్నన్న ఇంతవరకు ఏమి మాట్లాడకుండా వున్నాడు. ప్రజలకోసమే పార్టీ-పార్టీదే దళం, ఆ దళం బాధ్యత తన మీద వుంచింది పార్టీ. దంపాయ గ్రామం పార్టీకి గతకొద్ది సంవత్సరాలుగా పెట్టని కోటగా వుంది. ఈ ప్రాంతంలో పార్టీ విస్తరణకే కాదు మొత్తం ఉద్యమానికే కేంద్రంగా వుంటూ వచ్చింది. అందులో పాపన్న కుటుంబం కృషి ఎంతో వుంది. యువజనోద్యమంలో అతి చురుకైన వారు... ఆర్థిక రాజకీయ తదితర రంగాలతోపాటు వైద్య అవసరాలలో కూడా ప్రజల బాధ్యత పార్టీదే అవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో ఎంత చిన్న స్థాయిలోనైనా ఆ రకమైన సహాయం అందించడం తన కర్తవ్యం...నిర్బంధం వుంది, శతృ క్యాంపుకు అతి దగ్గరకు వెళ్ళాలి. పగటి సమయం! దాదాపు ముప్పావు మైలు మైదానం దాటి!!...

...ప్రజలే విప్లవకారులు, విప్లవకారుల పాలిటి శిక్షణ కవచం! ఈ విధంగా రెండు విరుద్ధమైన ఆలోచనల నుండి చిన్నన్న క్రమంగా తేలుకుంటూ ఒక నిర్ణయానికి వస్తున్న సమయానికి కామ్రేడ్ వహీద్ తన అభిప్రాయం చెప్పాడు.

'చిన్నన్న ఇప్పుడే కామ్రేడ్ ఈరన్న చెప్పినట్లు ఇద్దరు వెళ్ళాల్సిన అవసరం నాకు కనిపించటంలేదు. వైద్యునిగా మీరేవెళ్ళాలి. కాని ఎటువంటి నష్టం జరగకుండా తిరిగి రాగలరా అనేదే నా అనుమానం.'

"ఒకవేళ నష్టమే జరిగితే పార్టీకి-మీరు సేవ చేయాలనుకున్న ప్రజలకు నష్టమే కదా!— కాబట్టి చాల తూచి అడుగు వేయాలి" ఆఖరిగా బాబన్న అన్నాడు.

అప్పుడు చిన్నన్న "ఔను కామ్రేడ్స్! మీ అభిప్రాయాల సాయంతో నాకు అనిపించిందేమిటంటే నేను వెళ్ళవలసిన బాధ్యత వుంది. ఒంటరిగానే వెళ్ళాలి. ఎందుకంటే పగలు పోవాలి! ఏదైనా సమస్య ఎదురైతే జరిగే నష్టాన్ని సాధ్యమైనంత తక్కువయ్యేటట్లు ప్రయత్నించాలి. అన్నివైపులనుండి ఆలోచించినాంక ప్రజల సేవ కోసం కొద్దిపాటి ప్రమాదాల నెదిరించక తప్పదు అనిపిస్తుంది. అందుకే నేనొక్కన్నే వెళ్ళాలి. గ్రామంలో మనకు పూర్తి సహకారం వుంది. శతృవు ఎవ్వరూ లేరు. పైగా పైగ్రామంలో శతృవు నా రాక తెల్సుకొని వచ్చేలోగా ప్రజలకున్న వేలాది కండ్లు - చెవులు మెలుకువ వహిస్తూ పసికట్టగలవు. నాకు రక్షణ ఇవ్వగలవు. విప్లవ చైతన్యమున్న ప్రజలు అన్ని సాంకేతిక - ఆధునిక సౌకర్యాలు కలిగిన అభివృద్ధి నిరోధక శతృవుకన్నా చాలా బలవంతులు. నాకున్న ఇతర బాధ్యతలను మరవకుండానే ఈ విషయాలన్ని ఆలోచించి నేను కామ్రేడ్ పాపన్నతో ఒంటరిగానే వెళ్ళాలనుకుంటున్నాను. వీటిని దృష్టిలో వుంచుకొని మనమొక నిర్ణయానికి రావాలి" అని తన ఆలోచనలను అభిప్రాయాలను తనతోటి దళ సభ్యుల ముందు వుంచిండు.

కొద్దిసేపటిలోనే చిన్నన్న ఒక్కడే, అప్పుడే పాపన్నతో బయలుదేరాలనే నిర్ణయం తీసుకోబడింది. చిన్నన్నపోతూ "నేనువెళ్ళి సాయంత్రంకల్లా తిరిగివస్తాను. మీరు జాగ్రతగా వుండండి. కామ్రేడ్ బాబన్నా ! దళం బాధ్యత ఇకమీదే. నేను తిరిగి రావటం ఆలస్యమైతే కొంతదూరం వెళ్ళి నా కోసం ఆగండి. మన అంకమ్మ చెల్లి కాస్త కోలుకోగానే ఈ సాయంత్రం వరకు అంతకైతే తెల్లవారే వరకు నేను వచ్చేస్తాను. ఇక వెలుతున్నాను. రెడ్ సల్యూట్స్!" అన్నాడు. తరువాత పాపన్నతోకల్సి "కిట్"(మందులసంచి) దీసుకొని, రివాల్వర్ నడుముకు కట్టి పైనంగా [1]అంగి [2]జారిడిచి [3]బయలుదేరిండు.

3

చెరువు కట్ట పక్కెంబడి నడుసుకుంటూ ఇప్పచెట్టు కిందికొచ్చి ఒకసారి ఆగి అన్నిదిక్కులు చూచి అంతా సరిగానే వుందని చూచుకొని పాపన్న ముంగట, చిన్నన్న వెంబడి నడువసాగాడు. వరిచేన్లు బీటలు బారి వున్నాయి. గట్లెంబడి ఇప్పచెట్లు ఎండకు బిక్కు బిక్కుమంటున్నట్లు అక్కడక్కడా నిలబడి వున్నయి.

28

1. మీదుగా 2, చొక్కా 3. తొడిగి

ఊరు కడకు ఉత్తరం దిక్కు మూడు నాల్గుగుడిసెలు - జొన్నచేండ్ల గట్లెంబడి అటోటిటోటి[1] కర్ర మొలిసినట్లు, పూరెన్క గుట్టకు కొంతదూరాన తేరాసు బండ[2] ఉన్నట్టు, గొడ్లమంద పక్కకు మొండెడ్లు అటీటు తిరుగుతున్నట్లు, దళపోల్లు పన్నకాడికి కొంతదూరంగా సెంట్రీ నిలుచున్నట్లుగా - ఆ గుడిసెలు పూరు పక్కకు ఉన్నై. అవిదాటి వాళ్ళు చింతచెట్టు కిందికెళ్ళి సర్కారు బావిదాక ఉన్న సందుకు అటీటు వున్న గుడిసెల్లో కడదాంట్లో కెళ్ళిరు.

చిన్న నాలుగు దూలాల పందిరి చుట్టు వున్న ఎనుగుకు[3] గుజ్జుకొయ్యలు[4] దీసి పాపన్న వాకిటిలోకి అడుగు బెట్టిండు. చిన్నన్న గడప[5] కాడ ఆగి ఒకసారి అటు ఇటూ చూసుకొన్నడు. లోపలికెల్లి వాకిట్లో ఒక మూలకున్న నీళ్ళ బడ్డి[6] కాడ పాపన్న కాళ్ళు కడుగుతున్నడు. చిన్నన్న కిట్ కిందబెట్టి అక్కడికిపోయి పాపన్న చేతి చెంబందుకొని తను కాళ్ళు కడిగిండు. కండువతో మొకం తుడుచుకుంటూ వచ్చి కిట్ అందుకొని పాపన్న తడక జరపగా లోపలి కొచ్చిండు. పాపన్న కన్నా పెద్ద వాడైన సర్సన్న తన భార్యా బిడ్డలతో కల్సి ఆ గుడిసెలోని మూడవ వంతు వరకు తడకలు కట్టి విడిగా వుంటున్నాడు. పాపన్నకు ఇంకా పెండ్లి కాలేదు. తల్లి, ఇద్దరు చెల్లెండ్లు, తనూ నాల్గవ వంతు ఐన తమ భాగంలో వుంటున్నారు. ఇంటెన్క నుండి తడకలు కట్టి ఆరేడు మూరల ఆ అర్రను[7] అన్న ఉంటున్న భాగం నుండి వేరు జేసుకున్నరు.

లోన చీకటి. అందులోనే ఒక మూలకు చిన్నపొయివుంది. చిన్న నులక మంచం వేసి వుంది లోపలిగోడ కానించి. మంచం పటంగా రెండు మూరలజాగే మిగిలింది. పాత నులక మంచంలో లొట్టబోయిన[8] కండ్లు మూతబడి చాలా బలహీనంగా తయారైన అంకమ్మ చినిగిన చెద్దరు కప్పుకొని పడివుంది. చిన్నన్న జప్పున[9] బ్యాగ్ తీసి ఆల[10] తీసిండు. నడుముకున్న వాచి తీసి చేతికి పెట్టుకుంటూ గబగబా పరీక్షించిండు. మట్ట[11] బట్టి నాడి పరీక్షించిండు. తరువాత ఆల మెడకు ఏల్లాడదీసి చేత్తో అంకులు చెల్లెలు డొక్కలో ఒత్తొత్తి జూసిండు. సంకలో మీటర్ (థర్మామీటర్) బెట్టి కాసేపాగి దీసి చూసిండు. జాడిచ్చి మల్లా డబ్బల బెట్టిండు. ఆ చెల్లెని ఎల్కల[12] వండుకోబెట్టి మోకాల్లకాడికి కాల్లుమలిచి పడుకోబెట్టి మల్లి డొక్కలో ఎడమబాజు, కుడిబాజుకు తన చేతి ఏల్లతోని పొడిచి పొడిచి చూసిండు. బోర్లపడుకోబెట్టి మల్లి ఆల చెవులకు బెట్టి ఏదో

---

1. అటు ఇటు 2. ఊరుపక్కకు ఉన్న ఒక పెద్దరాయి పేరు 3. కంచెకు 4. వాకిలి తలుపుకు బదులుగా వాడే ఒక పక్కకు జరుపుకునే కొయ్యలు 5. కడప 6. నీళ్ళ కుండలు పెట్టెటందుకు చేసిన స్టాండు 7. గది 8. లోతుకు పోయిన 9. తొందరగా 10. స్టెతస్కోపు 11. మణికట్టు దగ్గర 12. వెల్లకిల

ఇనుకుంటూ జరుపుతూ, తీస్తూ వున్నడు. తన ఎడమచేతి ఏల్లను అంకమ్మ ఈపుపై పెట్టి తాపుకొకసారి ఎడమబాజుకు ఒకసారి కుడి బాజుకు సంతలో కుండను కొట్టిచూసినట్లు కుడి చేతి చూపుడేల్లతో కొట్టి కొట్టి చూసిండు. కొట్టిచూడంగా ఏదో ఇన్నడు. చెయ్యి చెద్దరు కిందికెల్లి తీసి గోర్లొత్తి చూసిండు. కంటిరెప్పలు కిందివి కిందికి ఒత్తిచూసిండు. సంచిల బ్యాట్రిలైట్ తీసి కండ్లల్ల గొట్టి అటీటు జరుపు కుంటు చూసిండు. అరిపాదాలు ముందుకు వత్తి చూసిండు. మల్లి ఆలబెట్టి గుండె చప్పుడు ఇన్నడు.

గిర్రున తిరిగి సంచిల చెయ్యిపెట్టి సూదుల పెట్టె తీసిండు. పాపన్నను పిలిచి ఒక తెల్లగంజు[1]లో మంచిసీల్లు పట్కరమ్మన్నడు. పాపన్న ఉర్కి పోయి నీల్లు పట్టుకొచ్చిండు.

చిన్నన్న పెట్టెమూత తీసి సూదులు పిచకారి[2] వేరువేరు చేసి గిన్నె నీల్లలో ముంచి గిన్నెకు మూతబెట్టి ఇగ పొయిమీద పెట్టమన్నట్లు సైగజేసిండు. ముసలి తల్లి పొయ్యి ఊదబట్టింది.

చిన్నన్న సంచిలకెల్లి ఇంకేంటెంటియో సీసాలు డబ్బాలు బయటకు తీసిండు. బాగా మసిలిన తరువాత సూదులు పటకారు[3]తో బట్టి తీసిండు. ఏవోరెండు సీసాల మందులు అండ్ల గుంజిండు. సూది ఇచ్చిండు. ఇంతసేపు సైసప్పుడు చెయ్యని అంకులు ఏదో మూల్గినట్టుచేసింది.

బారెడు పొద్దుండంగ అంకులుకు చెమటలు పోసినయి. రెండు మూడు సూదులు ఏసినంక పెంకోలె కాల్తున్న పెయ్యి[4] చల్లబడ్డది. ఆలబట్టి చూస్తున్నడు చిన్నన్న.

మల్ల ఏదో సూదిచ్చిండు. అప్పుడు తేరిపారి జూస్తే గఃవలకాడ శానమంది నిలుసున్నరు. అతనికి కూడా చెమట బట్టింది. కండువకు తుడ్సుకున్నడు. గవల కాడ కూడిన జనం అతనటు వస్తుంటే అటీటు జరిగిండ్రు. కొద్దిగా గాలాడింది. అతడు లేచి బయట కొచ్చిండు.

"ఆసం చిన్నవ్వో... ఓ యాలమ్మొదినో! మీరంత గఃవల కాడికెల్లి జరుగుండ్లి." వస్తూ వస్తూనే అన్నడు నర్సిగాడు. చిన్నన్న "నిజమే మనోడు చెప్పేది అంకులుకు గాలి ఆడకుండా చెయ్యకండి" అనివచ్చి యింటి బయట అరుగు మీద అందరి మధ్యలో కూకున్నడు.

"నిజమే నాయన నీ కడుపు సల్లగుండ! మేమంత నీ కోసం రోజు చూసు కుంటూనే వున్నాం ఇగ వత్తావని. ఇన్నాల్ల కొత్తివి. ఇగ మాకేఫికరు[5] లేదు. నీ

---

1. అల్యూమినియం గిన్నె 2. సిరంజి 3. ఫోర్ సెప్ 4. శరీరం 5. చింత (విచారం)

చేతుల బడ్డది. ఇగ అంకులు సావదు" అనుకుంటు ఆసమోల్ల చిన్నవ్వ చిన్న చిన్న పిల్లగాండ్లను జరుపుకుంటూ చిన్నన్న పక్కకొచ్చి కూలబడ్డది.

ఇంతలో ఏదో గ్యాపకం వచ్చినట్టు ఆలమోల్ల నర్సిగాడు ముందుకొచ్చి తన మెడ మీద బల్లుచ్చ (తామర) చూపెట్టిఒత్తుడుకీస[1] మందు చిన్నన్న ఇస్తె ఆకు డొప్పలో బట్టుకున్నడు.

"మనకిదేం చచ్చేకాలమొచ్చింది చిన్న? నీ జాడ జెప్పమని మల్లారం క్యాంపోల్లు పొద్దుగూకులు ఊర్మీనబడి సంపక తింటండ్రు. మొన్ననే బడె సత్తయ్యను బట్కపోయి నీజాడ జెప్పమని ఆరం రోజులు కేంపులుంచి సత్తయ్య కొడుకు కర్రమీద దుబ్బగుడెం పోయి సంపాయించుకొచ్చిన ఇన్నూరి త్తె[2] ఇడసబెట్టింద్రు. సిమాంట దళమొచ్చినప్పుడు బువ్వపెట్టినమని చెప్పి హరిగోస బెట్టిన సంగతి నీకెరుకేనాయె. గప్పుడు ఇంటికి ఐదు రూపాయలు పసూలు జేసింద్రు. ఆరంరోజుల కింద కమ్మరి మల్లయ్య పెద్దమేకపోతు మందతో తిరిగి రాలేదు. కేంపోల్లు కోసుక తిన్నరని తెల్సి అడగబోతే తన్ని ఎల్లగొట్టింద్రు. తల్సుకుంటే కడుపు బగ్గుమంటది. మేమైతే చిన్నా, కోసినా నీ జాడ, దళంజాడ చెప్పలేమనుకో. మీరు శేబట్టి ముత్యం చుక్కయ్య చేండ్లల్లకెల్లి తిప్పనపల్లిబోయే కచ్చులాల బాట మనకు దక్కింది. వాని కంచె బీకి బండ్లు నడిపినప్పటి సంది పొగాకు తోటలల్ల పోయె టోల్లకు జీతాలు బెరిగె. మీరు లేకుంటే ఆ సైకోని[3] మాముల్లు పుల్లెర, నాగటిపన్ను కట్టలేక సచ్చేది..."అంది యాలమ్మొదిన.

"అడివి సరికి మన బొక్కదొర కుంటల ముప్పయి ఏండ్ల తర్వాత మనం దున్నుకోగలిగేదొదినా?... మనూళ్ళె ఆ సైకోడు కస బిస[4] పండ్లు కొరికిండు. కట్టెబండ్లు పట్టుకుంటా నన్నడు...రేంజర్ని తోల్కచ్చిండు - పోలీసుల దెచ్చిండు. ఎన్నో జేసిండు. కాని చిన్నన్న దళ పోల్లొచ్చి వాడ్ని ఒకసారి పట్కపోయి పెయ్యి కున్న కొవ్వు కరిగేదాన్క అడవిలో కట్టేసెసర్కి, మనమంత గల్సి పట్టిచీరిన మాభూమి ఒదలమని ప్లాంచేసను పీకి యాభై అరకలు ఏకం గట్టి నిలుసుండేసరికి వానికి బుద్దొచ్చింది—గది చెప్పరాదొదిన" అని నర్సిగాడందుకుండు.

నర్సిగాడు చెప్పుతున్నప్పుడు బయట బజార్ల సైకిల్ గంటి మోతినచ్చింది. ఆ యింటి ముంగటికెల్లి సాలెసాంబయ్య ఝుయిమని సైకిలెక్కి ఎక్క బట్టలమూట బెట్టుకొని నింషంల దాటిపొయిండు.

చిన్నన్న లేచి ఇంట్లకుపోయి అంకులు కండ్లు తెరిసి మిట మిట జూస్తుంటే "ఇప్పుడెట్లున్నది చెల్లి!" అని పల్కరించిండు. పాలిపోయిన మొఖం మీద నన్నగా



1. మందుట్యూబ్ 2. రెండుపందలు 3. చౌకిదారు, ఫారెస్టుగార్డు 4. పటపట

నవ్వు—దూరం బీరమాయ గుట్టమీద చెట్ల సందులకెల్లి అగుపడే కచ్చలాల బాట తీర్గ, నడిగోదాట్ల దూరంగా చిన్నగ కండ్లబడే సూరన్న నావలాగ, అకురాలంగ నిలుసున్న బరిజాత చెట్లల్ల అక్కడోటి అక్కడోటి మోదుగులకున్న ఎర్రటి మొగ్గ ల్లాగ, దుక్కిబట్టిన నడిపన్న నల్లటి పెయిమీద మెరిసే చెమట తీర్గ ఆ నవ్వు వెలి గింది. "మంచిగున్నన్న" సన్నగ పల్కింది అంకమ్మ.

చిన్నన్న అవ్వనుపిల్చి దగ్గరకూకోబెట్టి సంచిల డబ్బల వెత్కి తగురాల మాతర్లు తెల్లటివి, నల్లటివి, ఎర్రటివి రంగురంగుల గోలీలు మూడు నాల్గురకాలై అవ్వచేతికిచ్చి "ఇదోటి ఇదోటి ఇదోటి పొద్దటీలి-ఈ మూడు, పగటీలి-మూడు, మాపటీల నిదురబోయె ముందు ఐద్దినాల దన్క వర్సతప్పకుండా ఇవ్వాలి. ఈ మాతర్లు ఈ రాత్రి కొద్దిగా బువ్వ తినిపించి అటెన్క ఇచ్చెయి. ఇవన్నీ అయిపోయి నంక ఈ నల్లటి మందుగోలీలు పద్దినాల్ దన్క రోజుకు మూడు ఇవ్వాలి. ఇవ్వింగాలి తగలకుండా చూసుకోవాలి. ఇదిగో ఈ సీసల బెట్టిచ్చిన గోలీ ఇచ్చినప్పుడు దీసి మల్ల గట్టిగా మూతబెట్టుంచు."

అవ్వ మర్చిపోకుండా రెండు మూడుసార్లు జెప్పిండు.

మంచం మీద పడుకున్న అంకమ్మ చెద్దరుమీదబడి ఇంకాపైకిపోతూ ఇక్కడ ఆగనంటున్నట్లు దగ్గరేసిన తడక సందుల్ల కెల్లి సన్నగా ముగ్గెసినట్లు అవత లి గోడ మీద పడుతుంది- ఎర్రటి వెలుగు. చిన్నన్న బయటికివచ్చి చూసిండు. పచ్చగా చెర్వుకటీటు చెర్వేనక ఎంత దూరం జూసినా కనిపించే అడివిలో తలెత్తి నిల్చున్న ఊరెన్క గుట్టసాటుకు సూర్యుడు పడమటికి జారిపోతున్నడు.

4

చెర్వు కట్టకాడ దుమ్ము లేచింది. గొడ్లు మర్లినయా?

కాదు.

కాకి బట్టలు- చిప్ప టోపీలు- పోలీసులు

ఆ దుమ్ము భూమి డొక్కలో రాక్షసుల బూటు తన్నులతో లేచింది. ఎర్రని సూర్యుడు ఒంటరి వాడైనట్లు అడివి దిక్కు గుట్ట చాటుకు దాగాలని ప్రయ త్నిస్తున్నట్లు వున్నడు. అటు మాదిగ గుడిసెల తోవ పొంటి ఇంకో గుంపు రెండు దిక్కుల కెల్లి ఊర్లె కొచ్చిన్రు. టక టక బూట్ల చప్పుడు. అంతెత్తు లేచే దుమ్ములో కూడా వాల్ల చేతుల్లోని తుపాకులకున్న బయనెట్లు తల్కున మెరుస్తున్నయి.

మూడు బజార్ల కాడ బడి దగ్గర రెండు గుంపులు కల్సినయి. మొత్తం ఇర్వయి మంది వుంటరు. మూడు పట్టీల మేజర్‌గాడు బాగా తాగివున్నట్లు వున్నడు.

కండ్లు ఎర్రగున్నై, మాటలు ముద్దబడుతున్నై. బొర్రమీద బెల్టు నిగ్గి[1] కట్టిండు. నోట్ల నురుగు పెదిమల కొసల కాడికి కారుతుంది.

ఆ వూరు దొర చట్టపోల్ల వూరు.

దొర చట్టపోల్లు

దొరలే రైతులు-రైతులే దొరలు. దొరలే పెద్దలు. చేతి బలం కొద్ది ఐదెకురాలో పదెకురాలో అడివి కొట్టి బయలు జేస్కున్నరు. చేతైన కష్టం జేస్తారు. పండింది తింటరు అయిపోతే అడివి పడ్తరు. ఇప్పపువ్వు, తునికిపండ్లు ఏర్క తింటరు. పై వూరి సాపుకార్లు- ముత్యం చుక్కయ్య లాంటి భూస్వాముల, పెత్తందార్ల కాడికి కూలికెల్లినా ఇంతవరకు వారికి లొంగిపోలేదు. పెత్తందార్ల ప్రభావం నుండి ఆ అమాయకులు తప్పుకోవటమెలా? ఇప్పుడిప్పుడే తెల్సుకుంటున్నారు.

అదో చిన్న వూరు. పెత్తందార్లులేని వూరు. అందుకే ఈ వూరంటే క్యాంపు కమాండర్ హవల్దార్ మేజర్‌కు ఒల్లు మంట. దిక్కులేని అడివి మనుషుల- 'మర్యాద' తెలియని జంగ్లి పసుల వూరని అతని అభిప్రాయం.

"భైన్‌కే-లా...గాల్లు! ఎటు బోయిర్రు రా అంతా? హరాంకా బచ్చా" ఉరిమిండు మేజర్. పనులనుండి తిరిగొస్తున్నబుడ్డగోసి గోండు జనం ఒక్కొక్కరే వచ్చి జేరుతుర్రు మూడు బజార్లకాడ. పెద్ద మనుషులు ఏల్లే- అడివి బిడ్డలు.

మాంజి[2] చెప్తె ఉర్కిపోయి మంచందెచ్చి బజార్లో ఏసిండు బొక్యన్న. మేజరు కూకున్నడు- కూకున్నడో కూలబడ్డడో అందులో

"నక్సలైట్లను దాస్తున్నార్రా? బడివె కోర్లు మీరు! కమ్యునిస్టులకు మీరు బువ్వ బెడ్తర్రా?"

అదివరకే ఇర్వై మందిదాంక జమ[3] అయిండ్రు జనం. ఎవరూ పల్కలే. పోలీసోల్లు మంచాని కటీటు నిలబడి మిట మిట చూస్తుర్రు. ఐదార్గురు మంచాని కెదురుగా కూకున్న మందిల వచ్చి నిలబడ్డరు.

"ఇన్నాల్లకు మీ పని ఐతదిరా! బాడ్కావ్‌లు, మీరు సర్కార్‌తో గెలుస్తార్ర? నక్సలైట్లను పిలిపిస్తార్ర వుల్లె, మాకేలాడె"- హవల్‌దార్ అన్నాడు.

కూటికే సస్తుంటిమి - మాకే దిక్కు లేదాయే... నక్సలైట్ల సంగతి మాకే మెరుక..." మాంజి ఇంకేదో చెప్ప బోయిండు.

చిన్న పంతులు (హాస్టల్ వార్డన్) అటే వస్తూ ఈ మాటలు విని "హవల్



1. గుంజి కట్టి (గట్టిగా బిగించి)
2. ఊరి పెద్ద (కులపెద్ద) 3. పోగవ్వడం, కూడిర్రు.

దారుగారు నక్సలైట్లు ఈ చిన్న వూళ్లకెందుకు వస్తారు? వచ్చినా పట్టుకోవల్సింది మీరు. వూరి వాల్లను ఇట్ల దబాయిస్తె ఏమన్నట్లు?" అని అడిగిండు.

కండ్లతోనే నమిలేసేటట్లు అటు జూసిండు హవ్వల్‌దార్ "ఓ పంతులు! నీ పని ఏదో నువ్వు జూస్కో. సర్కార్ జీతం తిని ఊరోల్ల దిక్కు పల్కుతవా? - మా పనికి డిస్టబ్ చేస్తే నువ్వే నక్సలైట్లకు సాయం జేస్తున్నావని రిపోర్టు రాస్తా! ఈ ఉద్యోగం పీకిస్తా! జాగ్రత్త! చల్లగుండదలుస్తే మా డ్యూటీలో, మా రెడ్‌లో ముక్కు దూర్చకు...హాఁ!"

పంతులు అక్కడ వుండలేక ఆశ్రమ స్కూలు వైపు నడిచిండు.

"హాఁ! డాక్టరు రాలేదురా బోసిడికే - మీ వూళ్ళె! సాలె సాంబయ్య వచ్చి గంటయినా కాలేదు. వాన్ని రెండేసి 'నక్సలైట్లకు క్యాంపు ఇన్‌ఫర్‌మేషన్ ఇస్తున్నావ'ని బెదిరిస్తే 'నాకేమి తెలియదు సార్, బట్టలమ్మి వూరూరు దిరిగి బత్కెటోన్ని అని పదిరూపాల మామూలిచ్చి' దంపాయ వూళ్లె ఇప్పుడే డాక్టర్ను జూసినసార్ - జమదార్‌సాబ్, నన్నట కాయించకుర్రి' అని కాళ్ళమీద బడితే ఇడ్సబెట్టిన. ఇంక ఆ లం...కొడుకుపోయి అర్ధాగంట కాలేదు! వాడు వుత్త పిరికి ముండా కొడుకు - నిజమే చెప్పి వుంటడు. రాలేదురా డాక్టర్ మీ వూళ్లే? ఎవలింట్ల దాచిర్రో చెప్పుర్రి బతకబుద్ధుంటే......లాభం లేదు. వీల్లట్ల జెప్పరు... సీధి వుంగ్‌లీసే ఘీనహీ[1] నికల్‌తా. ఉంగ్లీ తేడా కర్‌నా పడేగా'... నాయక్! నీ సెక్షన్‌ని అటు చెరువు కట్ట దిక్కున గుడిసెలకు 'లీడ్' చేయి! ఒక్కొక్క ఇల్లు 'సర్చి' చేసుకుంటూ రావాలి. ఆ డాక్టర్‌గాడు వుండే వుంటడు. ఇంత తొందర్లో పోలేడు — మనం టూవే - ఎన్ సర్కిల్'[2] జేసినం...పోలేడు. చీకటి కాక ముందే పట్టుకోవాలి.... దొర్కుతే మనకే 'రివార్డు' వస్తది"... "సెక్షన్ వన్! మూవ్... సెక్షన్ టూ! నాతో పాటే వుండండి" అని ఆర్డరిచ్చిండు. మంచంకాడ నిలబడ్డ జవాన్లలో ఓ పది మందిని వెంటదీస్కోని నాయక్ చెర్వు కట్టదిక్కుపోయే తొవ్వలో ఎల్లిపోయిండు.

నడిసి నందుకు అలిసిపోయిన జవాన్లలో కొందరు వూరోల్లతో కల్సి కూసునోల్లు మేజర్‌వైపు విచిత్రంగా చూసిర్రు. వాళ్ళలో ఒకడు:

"మేం లేకుంటే - మాగార్డు లేకుండ దొడ్డికైనా పోడు!...వీడు నక్సలైట్లను బడ్తడట !!' ఇంకొకడితో మెల్లం గన్నడు. పక్కనే కూకున్న నర్సిగాడిన్నడు... నవ్వాపు కున్నడు.

సిగిరేటు వెలిగించిండు, ఆ ప్రయత్నంలో ఐదారు అగ్గిపుల్లలు పాడు జేస్కున్నడు 'మేజర్' ఏదో వాగుతూనే వున్నడు తనకుతానే.



---

1. చక్కగా పెట్టిన వేళ్ళకు వెన్నంటదు - వేళ్ళు వంకర చేయాలి - అనే సామెత (హిందీలో). 2. రెండు వైపులనుంచి చుట్టి వేత.

మాంజి కండ్లతోనే ఏదో సైగ జేసిండు నర్సిగానికి చుట్టూవున్న పోలీసులకు అనుమానం రానీయకుండ. నర్సిగాడు మంచినీళ్ళ బావికాడికెల్లి ఇటే వస్తున్న పుల్లైద్దుకు అడ్డందిరిగి అటే, చింతచెట్టుకేయి గెదిమినట్టు తను అటే దానెంటే పోయిండు. అటు నీళ్ళ కావడితో వస్తున్న పాపయ్య, ఇంటి గవలకాడ నిలుసున్న పెంటన్నలసు నర్సిగాడు కండ్లతోటే ఏదో చెప్పిండు. పాపయ్య బాయికాడికి పచ్చి కుండలు దించి తాడు - బొక్కెన బాయిలేసిండు. పెంటయ్య ఇంట్లకు బోయి నారేపనార[1] పట్టుకొచ్చి అటు నర్సిగాడిటు పాపయ్య కనబడేటట్టు ఇద్దరికి చెరిసగం దూరంలో కూసున్నడు. చేతుల్లో వున్న నారతో వెలుగు సవరించుకుంట కట్టుడు మొదలు వెట్టిండు.

సెక్షన్ వన్ కడ గుడిసె కాన్నించి ఒక్కొక్క గుడిసెలో దూరి వెతుక్కుంటూ మూడు బజార్లకాడి కొచ్చింది. బడి అవుతల అబ్బన్న గుడిసెలోకి పోయి బయటి కొచ్చేలోగా పాపన్న నీళ్ళకావడి బుజాని కెత్తిండు. పెంటన్న లేచి చింతచెట్టుకేయి నడిచిండు. పాపన్నతో గుసగుస ఏదో చెప్పిండు. అతని సంచందుకొని బిరబిర నడిచి ఇంటెనక్క ఎన్ను దునికి కండ్ల నీరు పెట్టుకున్న అవ్వతో, తెల్లగా జూస్తున్న అంకులుతో ఏదోచెప్పి కుడిచేతితో నడుముకున్న రివాల్వర్‌ను తాకి చూసుకున్న చిన్నన్నను తనవెంట రమ్మన్నడు.

పాపన్న ఇంట్లోకొచ్చి తల్లితో ఏదోచెప్పి మందు గోలీలన్ని తీసుకొని నీళ్ళ కావడి కుండలను బడ్డిమీద బెట్టి ఉత్తకుండలు పెట్టుకొని బయటి కొచ్చిండు. అక్కడ వచ్చి నిలబడ్డ పెంటన్న చేతికి ఆ మూతర్లు ఇచ్చి ముందుకు సాగి పోయిండు. పోలీసోల్లు ఈ బజార్ల యాలమోల్ల ఇల్లు వెతికి ఇటే తన ఇంటివైపే వస్తూ ఎదురైండ్రు. పెంటన్న మల్లి ఎనుగ్క నారకట్టు కడుతున్నడు. పాపన్న పక్కకు జరిగి నిలుసున్నడు.

సెక్షన్ ఇంచార్జి అతని వైపు పురుగును చూసినట్లు చూసి దాటి పోయిండు. పాపన్న సర్కారు బాయికాడికొచ్చి మల్లి నీల్లు చేదబట్టిండు. అతని ఇల్లు 'రేడ్' అవుతుంది.

మంచాట్ల వున్న పీనుగలాగా అంకమ్మను చూసి అసహ్యంతో మూతి మీద దస్తిగప్పి నాయక్ లోపలికి తొంగి జూసిండు. ముసలవ్వ కుండలకాడ బెదురు కండ్లతో కూకున్నది. "ఇద్దరాడోల్లే సార్" జవాన్ మాటవిని ఎన్కకి తిరిగి బయటకు వస్తూ నాయక్ నీట మునిగి తేలినోనోలే పెద్దగా ఊపిరి పీల్చుకున్నడు. ఇంకా ముందుకు సాగిండు ఈ బజార్ల మిగిలిన రెండుమూడు గుడిసెల వైపుకు— జవాన్లు వెంటరాగా.



---

1. అడివిలో వుండే పెద్దేపచెట్టు నార, తాడులాగ ఉపయోగ పడ్తుంది.

5

చిన్నన్నను తనవెంట దీసుకొని నర్సిగాడు జొన్నచేండ్లల్లపడి ఇండ్ల వెనక నడుసుకుంటూ చెర్వుబాజు కడయింటికి దళగట్లోల్లింటికి దబ దబ పోయి సంచి నడింట్ల బెట్టి ఇంటాయనతో "సమ్మన్న! పోలీసోల్లు ఇటు చూసి పోయిండ్రు.ఇప్పుడు చింతకింది గుడెంలున్నరు. మా వొడ్డు గుడానికి యిగ పోతరు. చీకటైనంక చిన్నన్నను మాదడపచేను[1]కాడ మంచెదాక సువ్వు పడగొట్టి రావాలి కాసేపాగి" అని చెప్పి చిన్నన్నవైపు ఒకసారిజూసి గబగబ వచ్చిన దిక్కే వెళ్ళిపోయిండు. నర్సిగాడెల్లిన దిక్కు జూస్తూ నిలుసున్న చిన్నన్నకు చీకటి ముదిరిందని నర్సిగాడు చీకట్ల కల్సిపోతుంటే అర్థమైంది.

నడింట్లో నెగడి వెలుగుతుంది. దొర చట్టపోల్లకదే దీపం. వాళ్ళు గట్టిగ నమ్మే వాటిల్లో అడివి వాళ్ళదెనన్నద దొకటి. అందుకే ప్రతిఇంట్ల నెగడివుంటుంది, దీపం వున్నా లేకున్నా. కిర్సనాయిలు బుడ్డి, లాంతర్లకు నూనె పిరమే[2] గాని అడివిలో కట్టెలకు కరువులేదు. సైకోని బయానికి మొదట దడిసినా దళం వచ్చిన కాన్నించి అడివి వాళ్ళదే అయింది.

సమ్మన్న తన ఏడాది నిండని బిడ్డ పారుతుందని[3] చెప్పిండు సన్నని గొంతుతో. సమ్మన్నభార్యఇస్తారక్క బిడ్డను ఎత్తుకచ్చి చిన్నన్నముంగట కూకున్నది. ఇస్తారక్క కండ్లల్ల ఆ చీకట్ల-నెగడి గుడ్డివెలుగులో కూడా మెరుస్తున్న కన్నీల్లను చిన్నన్న చూడ గల్గిండు. అందులో కదుల్తున్న రెండు మంటలు. మాటలు లేవు.

చిన్నన్న మెల్లగా మందు సీసా దీసి ఏదో మందుగోలి దంచి అందులో ఏసి-సీసను బాగ ఊపి ఇస్తారక్క చేతికిచ్చిండు. "కాపిస్క[4] తో రోజునాలుగు సుట్లు[5] గుడుపాలి[6] మందొడిసే[7] దాక"ని చెప్పిండు. అప్పుడే కొద్దిగ తన చేతులతోనే తాగించిండు.

ఇంతలో గుడిసె బయట అడుగుచప్పుడైంది. సమ్మన్న సప్పున లేబచియటికి పోతూ తడక బెట్టి వాకిట్లో నిలబడ్డడు. ఇస్తారక్క లేచి సంకల బిడ్డను గడంచల[8] పండుకోబెట్టి నెగడి కట్టెలు గుంజి మంట తగ్గించింది. గుడిసెంత ఇంకా చీకటైంది. సంచిని గుడిసె ఎనక దిక్కు తడక దగ్గర బెట్టి మొగరానికి[9] కట్టిన నారకట్టు విప్పి తడక సందుజేసింది. చిన్నన్న యింటెన్కకు పెరట్లకు పోవటాన్కి దారిజేస్తూ. ఇదంతా జేయడానికి గడియ పట్టలేదు.

చిన్నన్నను అవసరమొస్తే తప్పించటాన్కి ఆమె చొరువ-ప్రయత్నం...

---

1. ఒంప్రడు మట్టి చేను 2. అధిక ధర కలది 3. విరేచనాలు 4. కొపిచుక 5. సార్లు 6. త్రాగించాలి 7. మందు అయిపోయెవరకు 8. ఒకరకం మంచం 9. నిలువుగా పెట్టిన కర్రస్థంభం.

చిన్నన్న మనుసు కృతజ్ఞతతో నిండిపోయింది. బిడ్డకన్నా ఉద్యమం ఉద్యమకారు లంటే ఇస్తారక్కకు ఎక్కువ .సదువు సాత్రములేని దోపిడికి నలిగిపోయిన ఆ గిరిజన కుగ్రామంలో పుట్టి పెరిగిన ఈ కోయతల్లి......! కాదు' వచ్చింది పోలీసులు కాదు... సమ్మన్న తమ్ముడు బొక్కన్న. సమ్మన్న లోపలికొచ్చి చెప్పిండు. ఇస్తా రక్క అంతా సదిరింది మల్లా. తడక కట్టు కట్టి నెగడి మంటజేసి బిడ్డ నెత్తుకుంది. చనుపాలు ఇవ్వసాగింది కూసోని. చీకటి బాగానే అయింది.

ఊరులోని అన్ని యిండ్లు వెతికి అలిసిపోయిన పోలీసుపార్టీ అక్కడే మకాం చేసింది ఆ రాత్రి ఆశ్రమస్కూల్లో. చెంద్రన్న వచ్చి ఈ సంగతి జెప్పిండు 'డాక్టర్ దొరకలేదని, కల్లైనా కావాలని కెంపోల్లడిగింద్రట'ని కూకొని సుట్టకాల్చుకుంటూ నెగడికాడ. సమ్మన్న ఒకచేత సంచందుకొని ముందు నడువంగ చిన్నన్న ఎంబడొ చ్చిండు. జొన్నచేండ్లల్ల సరసర సప్పుడు కాంగ నిలువెత్తు చేండ్లల్ల అగుపడకుండా నడుస్తూ ఉత్తరం దిక్కు అడివి గోదావరొడ్డు కలిసేకాడ ఒర్రెదాటి దడప చేను మంచెకాడ ఆగింద్రు. నర్సిగాడు మంచెదిగి వచ్చి సంచందుకున్నడు.

'అంతాసరిగ్గానేవుంద'ని సమ్మన్న నిలుసుంటె "నీ బిడ్డ కక్కుడు పారుడు రెండొద్దుల్లో ఆగుతది. మందు సరిగావాడాలి. నువ్వీక పోయిరా సమ్మన్న"ని పిడికి లెత్తిండు చిన్నన్న. జవాబుగా సమ్మన్నకూడా లాల్‌సలామ్‌చేసి వెనక్కు తిరి గిండు. చీకట్లకల్సిపోతున్న వైపుచూస్తూ మంచెక్కసాగిండు. చిన్నన్న, తెల్లటి గోచిగుడ్డ కట్టుకొని అదితప్ప ఆ సలికాలంల ఏబట్టలులేని సమ్మన్నను. వేగుసుక్క లాగ వెలుగుతున్నడు సమ్మన్న.

సరసర కర్రలు కదిలే సప్పుడువిని గోదారిలో వార్రెకలిసే దిక్కుచూసిండు. చిన్నన్న నెత్తిమీద సదిమూట బట్టుకొని చెంద్రయ్య మంచెకాడి కొస్తున్నడు. నర్సి గాడు "నీకు నాకు ఇక్కడే వచ్చింది చిన్నన్నసద్ది" అంటూ మంచెమించి మూటందు కొని నెగడి (మంచె మీద మట్టిపోసి తడికకాలకుండా ఏర్పాటుచేసుకొన్న నెగడు) కాడబెట్టి చెంబందుకొని బర్రెకాడికి పోయి 'చెలమ' నీళ్ళతో మొకం కడిగి చెంబులో పట్టుకొచ్చి కూకున్న ఇద్దరు; తెల్లందాక జీవరాసుల[1] తరుముకుంటూ కూసున్నరు సద్ది తిన్నంక. పక్కచేన్ల ఎవరో పాడుతున్నరు చిరుతలదరువు లో

"పల్లె సీమల దొరలభూములు
భూమిలేని వారికిచ్చి
ముక్తి ప్రాంతం నిలుపుకుంటూ
పట్టణాలను చుట్టుముట్టి

1. అడివి జంతువులు

అంతిమంగా గెలుచుకోరన్న...
అనుమాన పడక ప్రజలరాజ్యం నిలుపుకోరన్న!!
ముక్తిపోరుల ముందుకురకన్న!!
శత్రుబలమూ క్షుద్రమేరా
చీలిపోయి వున్నరయ్యో
ఏకమయ్యి పేదలంత
కొత్తదెబ్బ కూల్తడయ్యో
ఎర్రదండుతో కలిసికదలన్న
అనుమాన పడక ముక్తిపోరుల!!
అటు దూరంగా-ఊరిదిక్కు నుండి
"గార్డ్ హోశియార్!
...ఘమ్ కౌన్ ఆతాహై...! వినబడ్తుంది పోలీసుల కేక.

మంచె దిగి అడివిదిక్కు నడువసాగిండు చిన్నన్న. గోదావరిలో అప్పుడప్పుడు చాపలెగరంగ 'బుడుక్' మనిసప్పుడు వినబడ్తుంది.

వేగుచుక్క బారెడెక్కింది.

## బోనస్

**పులుగు శ్రీనివాస్**

ఆ రాత్రి...గాఢమైన చీకటి రాత్రి...

దట్టమైన నల్లని పొగమంచు, ఆకాశాన్నంతా కప్పుకు పోయినరాత్రి...

ఎక్కడో దూరాన ఓ కుక్క 'బోరు'న ఏడుస్తోంది ఫ్యాక్టరీ ధ్వనుల్ని చీలుస్తూ చుక్కలు - చెమర్చిన కన్నీటి చుక్కల్లా మెరుస్తూ మిణుకు మిణుకు మంటున్నాయి. అక్కడక్కడ గుడ్డిగా వెలుగుతున్నయి లైట్లు దీనంగా.

ఆకాశం నించి - ఏ ఆశా పొందలేని దిక్కులు, చీకట్లతో బావురు మంటున్నాయి.

భూమి - తన ప్రకృతి ధర్మాన్ని నిర్దేశిస్తోంది. మనుషుల్లో - క్రూరత్వాన్నీ తారతమ్యాన్నీ, మోసాల్నీ, అన్యాయాల్నీ కసిగా ఉసిగొల్పుతోంది.

భయంకరమైన చీకటి సత్యాల్ని నిర్దయగా కాలరాస్తోంది.